వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 360 బుధవారం | 28 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




# భూపాలపల్లి ఓఎస్డీగా బోనాల కిషన్

భూపాలపల్లి జిల్లా ఓఎస్డీ (అదనపు ఎస్పీ ఆపరేషన్) గా బోనాల కిషన్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బోనాల కిషన్ 1995 లో ఎస్సైగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు.

- వరంగల్ వాయిస్, భూపాలపల్లి

వివరాలు 2,8లో..




# ఓరుగల్లు సుస్థిరాభివృద్ధి సాధించాలి

## రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

## నగరంలో ఘన స్వాగతం

## ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం

## కవులు, కళాకారులు, క్రీడాకారులతో కలిసి భోజనం చేసిన గవర్నర్

హనుమకొండ, వరంగల్ జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు నిట్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకి ఘన స్వాగతం లభించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ మహానగరపాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి, పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారదా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖడే, డీఎఫ్ఓలు అనుజ్ అగర్వాల్, లావణ్య, ఎన్పీడీసీఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తదితరులు పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు. వారితో పాటు రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, ఎమ్మెల్సీలు బస్వరాజ్ సారయ్య, తీన్మార్ మల్లన్న, బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ రెడ్డి, గవర్నర్‌ను కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ ఓరుగల్లు సుస్థిరాభివృద్ధి సాధించాలంటూ ఆకాంక్షించారు.

-వరంగల్ వాయిస్, హనుమకొండ







# కేశవమూర్తికి గవర్నర్ అభినందనలు

వర్ధమాన రచయిత, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తిని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అభినందించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాకు చెందిన రచయితలతో గవర్నర్ భేటి అయ్యారు. మధ్యాహ్నం వారితోనే కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుగా పనిచేస్తూ.. రచయితగా రాణిస్తున్న కేశవమూర్తి సేవలను గవర్నర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

- వరంగల్ వాయిస్, హనుమకొండ



8లో..

# జీఓ 46 బాధితులకు లభించని ఊరట

## కేసు కొట్టేసిన హైకోర్టు

## భావోద్వేగానికి గురైన బీఆర్ఎస్ నాయకుడు రాకేష్ రెడ్డి



8లో

# జిల్లా ఆసుపత్రిని తనిఖి చేసిన కలెక్టర్

# ఓరుగల్లు సుస్థిరాభివృద్ధి సాధించాలి

**రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**

**నగరంలో ఘన స్వాగతం**

**ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం**

**కవులు, కళాకారులు, క్రీడాకారులతో కలిసి భోజనం చేసిన గవర్నర్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చారిత్రక వారసత్వ నగరమైన ఓరుగల్లు సుస్థిరాభివృద్ధి సాధించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆకాంక్షించారు. కాకతీయ రాజులు పాలించిన సామ్రాజ్యంగా ఈ నగరానికి ఘనమైన చరిత్ర ఉన్నదన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ అనేక చారిత్రక దేవాలయాలు ఉన్న ప్రాంతం ఓరుగల్లన్ని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలోనూ జిల్లా ముందుండాలన్నారు. రైతుల ప్రయోజన నిమిత్తం కేంద్ర ప్రభుత్వం పీఎం కుసుమ్ యోజన పథకం ప్రవేశపెట్టినదని, ఈ పథకం ద్వారా సౌర విద్యుత్ ను వినియోగించుకొనేలా అధికారులు రైతుల్లో చైతన్యం కల్పించాలన్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి సాధించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బాగున్నాయన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి చెందడానికి ఎన్నో సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ఉండడం సంతోషకరమన్నారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా మరింత ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. నగరంలోని ఆస్పత్రులు ఎంతో పరిశుభ్రంగా ఉన్నాయనే విషయం తెలిసి చాలా సంతోషం కలిగిందన్నారు. చారిత్రక వరంగల్ నగరంలో పర్యటించడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లు, అధికారులు వారి పరిధిలో జరుగుతున్న అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశం అనంతరం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించారు.

## కవులు, కళాకారులు, క్రీడాకారులతో గవర్నర్ సమావేశం..

వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన వివిధ రంగాలలో ప్రఖ్యాతిగాంచిన కవులు, కళాకారులు, రచయితలు, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, పలు రంగాలకు విశిష్ట సేవలందించిన ప్రముఖులతో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సమావేశమయ్యారు. వారితో చర్చ గోష్టి నిర్వహించారు. అనంతరం వారితో కలిసి గవర్నర్ భోజనం చేశారు. ఈ చర్చ గోష్టిలో రచయిత డాక్టర్ లంక శివరాం ప్రసాద్, ఐఎంఏ ప్రెసిడెంట్ మొహమ్మద్ అన్వర్ మియా, సామాజిక కార్యకర్త మండల పరశురాములు, ఉర్దూ రచయిత గుల్షన్, జాతీయ బ్లైండ్ పారాజోడో అవార్డు గ్రహీత నాగరాజు, జాతీయ అవార్డు గ్రహీత రోహన్ సింగ్, చేనేత జాతీయ అవార్డు గ్రహీత పిట్టల రాములు, వర్ధమాన రచయిత, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి, ప్రఖ్యాత కూచిపూడి నృత్య కళాకారుని, గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత వెంపటి శ్రావణి, మహిళా శక్తి అవార్డు గ్రహీత కొంగ రజిత, హనుమకొండ జిల్లా నుంచి ఏందిరా సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, కవి రచయిత పొట్లపల్లి శ్రీనివాస్, శివతాండవం కళాకారుడు గజ్జల రంజిత్, ఇంటాక్ కో కన్వీనర్ పాండురంగారావు, కవి రచయిత నెల్లుట్ల రమాదేవి, ఆల్ ఇండియా గోల్డ్ మెడలిస్ట్ అజిత్ ఖాన్, ప్రముఖ క్రీడాకారుడు సారంగపాణి, సహృదయ నాటక సంఘం లక్ష్మీ కాంతారావు, తానా ప్రెసిడెంట్ ప్రవీణ్, రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ చందర్ రెడ్డిలతోపాటు వివిధ రంగాల్లో నిష్ణాతులైన 40 మందిని గవర్నర్ అభినందించారు.





















# ములుగులో గ్రామాన్ని దత్తత తీసుకుంటా..

**రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**

**ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మంత్రి సీతక్క**



**వరంగల్ వాయిస్, గోవిందరావుపేట :** ములుగు జిల్లాలోని ఒక గ్రామాన్ని త్వరలో దత్తత తీసుకుంటానని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా లక్నవరం సరస్సు ఐలాండ్ లో బస చేసిన గవర్నర్ బుధవారం ఉదయం లక్నవరం సరస్సులో మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.వెంకటేశంలతో కలిసి బోటింగ్ చేస్తూ లక్నవరం సరస్సు అందాలను తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క గవర్నర్ కు ప్రత్యేక ఫొటోను అందించి సత్కరించారు. గవర్నర్ గా నియామకం అయిన తరువాత మొదటి సారిగా ములుగు జిల్లాకు విచ్చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయన పర్యటన ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి సీతక్క కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం ఎండీ ప్రకాష్ రెడ్డి, జిల్లా ఎస్పీ శబరిష్, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సీహెచ్.మహేందర్ జి, ఆర్డీఓ సత్య పాల్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌కు పరామర్శ..

**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తిరుగు ప్రయాణంలో భాగంగా బుధవారం రాష్ట్ర పంచాయతి రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయతో కలిసి జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి గవర్నర్ అధికారులనుంచి వివరాలు సేకరించారు.
అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీస్ కానిస్టేబుల్ ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర పంచాయతి రాజ్ శాఖ మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ షబరిష్ తో కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కానిస్టేబుల్ కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ జగదీశ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ లాల్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చల్లా



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల విలీన గ్రామం సీతారాంపురంలో మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి తండ్రి రాజయ్య కొద్ది రోజులక్రితం అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదే విధంగా పరకాల పట్టణంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అంచూరి ప్రదీప్, ఏకు సిద్దు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా వారి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట స్థానికి పరకాల పట్టణ ప్రజాప్రతినిధులు, భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, మహిళ నాయకురాల్లు తదితరులు ఉన్నారు.

## గవర్నర్‌ను కలిసిన కార్పొరేటర్ నరేంద్ర కుమార్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ వరంగల్ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఎన్ఐటీ క్యాంపస్ లో బుధవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్ కార్పొరేటర్ శిరీష శ్రీమాన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు తోట బాలరాజ్ పాల్గొన్నారు.

## గుంతల పూడ్చివేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 36వ డివిజన్ పుప్పాలగుట్టలో రోడ్లపై గుంతలు ఏర్పడి వాహనదారులు కొంతమంది కిందపడి గాయాలపాలయ్యారు. బోనాలతో వెళ్తున్న మహిళలకు ఇబ్బంది కలగకుండా ఉండడానికి సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్ శ్రీనివాస్ నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి గుంతలను పూడ్చివేశారు.

## డోర్నకల్ రెగ్యులర్ సీడీపీఓగా లక్ష్మి

### వరంగల్ వాయిస్ కథనానికి స్పందన



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఐసీడీఎస్ డోర్నకల్ ప్రాజెక్టు సీడీపీఓగా లక్ష్మీ నియమితులయ్యారు. రెగ్యులర్‌లో డిప్యూటేషన్ అనే శీర్షికతో వరంగల్ వాయిస్ శనివారం ప్రచురించిన కథనానికి స్పందించిన రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ బుధవారం లక్ష్మీని బాల రక్ష భవన డిప్యూటేషన్ రద్దు చేపి డోర్నకల్ ప్రాజెక్ట్ సీడీపీఓగా నియమిస్తూ ఆర్డర్లు అందించారు. తన నియామకానికి సహకరించిన వరంగల్ వాయిస్ యాజమాన్యానికి లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.

# బీసీలను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు




**వరంగల్ వాయిస్, గీసుకొండ :** రాజ్యాంగం ప్రకారం బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లను ప్రభుత్వంలో న్యాయబద్ధమైన వాటాను వారికి దక్కకుండా అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ మండిపడ్డారు. బీసీల రిజర్వేషన్ ను 42 కు శాతానికి పెంచాలని, కామారెడ్డి డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే ఆమరణ నిరాహార దీక్షకు డీబీఎఫ్ తరఫున మద్దతు ప్రకటించి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా చాపర్తి కుమార్ గాడ్గే ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వం, సీఎం, మంత్రులు నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుందని, బీపీ, షుగర్ లెవెల్ పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చాపర్తి కుమార్ కు ఏదైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని, వెంటనే ప్రభుత్వం దిగివచ్చి బీసీల రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత, సామాజిక ప్రజాసంఘాలు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో మరో పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామ్మూర్తి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోకన్వీనర్ సోమిరెడ్డి శ్రీనివాస్, బీసీ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మపురి రామారావు, పీడీఎస్ యూ నాయకురాలు గుంటుక నవ్య, తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక నాయకులు అయితం నగేష్, నవరత్న ఆనంద్, దార సూరి, దేవేందర్ రెడ్డి, గోపనబోయిన రాజు, పైస్ల వెంకటయ్య, ఎండీ అంకూస్ వలీ, డీబీఎఫ్ నాయకులు మోరి ఐలయ్య, పోలేపాక మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు వీడియో ప్రచారం చేసిన ఇద్దరిపై కేసు

### కొయ్యూరు ఎస్సై నరేష్



**వరంగల్ వాయిస్, మల్హర్ :** తప్పుడు వీడియో ప్రచారం చేసి ప్రజల్లోకి తప్పుడు సమాచారం తీసుకువెళ్లిన ఇద్దరు వ్యక్తులపైన కేసు నమోదు చేసినట్టు కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 20న కొయ్యూర్ కేపీఎస్ బ్రిక్స్ లో పని చేసే ఒడిస్సాకు చెందిన నరేంద్ర మోజె అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా అతడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి మృతదేహానికి మహాదేవపూర్ గవర్నమెంట్ హాస్పిటల్ లో పోస్టు మార్టం నిర్వహించి, చనిపోయిన వ్యక్తి తండ్రికి అప్పగించగా, మృతదేహాన్ని ఒడిస్సా తీసుకొని వెళ్లే స్తోమత లేక తండ్రి, కుటుంభ సభ్యుల కోరిక మేరకు కొయ్యూరు పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్ద మనుషులు, బ్రిక్స్ యాజమాన్యం సహకారంతో చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల సమక్షంలో కొయ్యూరు గ్రామ శివారులో 21న అంత్యక్రియలు నిర్వహించడం జరిగింది. తరువాత అంత్యక్రియలు జరిగిన ప్రదేశాన్ని ఇద్దరు ఆకతాయి వ్యక్తులు వీడియో తీసి మర్డర్ చేసి శవాన్ని పాత్తిపెట్టారని, తప్పుడు సమాచారం ఇస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, పోలీస్ వ్యవస్థకు భంగం కలిగించే విధంగా వాట్సాప్ గ్రూప్ లలో సర్క్యులేట్ చేసిన ఇద్దరు వ్యక్తులపై కొయ్యూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రజలు ఎవరు ఇలాంటి తప్పుడు సమాచారాలు నమ్మవద్దని, అదేవిధంగా ప్రజలు ఏదైనా సమాచారం గ్రూపులలో సర్క్యులేట్ చేసే ముందు ఒకసారి చెక్ చేసుకోవాలన్నారు. తప్పుడు ఆరోపణలు, సమాచారం షేర్ చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## రోడ్డు పక్కనే చెత్త



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూర్ మున్సిపాలిటీ దినదిన అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా పట్టణ కేంద్రంలో సరైన డంపింగ్ యార్డ్ లేకపోవడంతో పట్టణ కేంద్రంలోని ప్రజలను నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను మహబూబాబాద్ రోడ్డుకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన వేస్తున్నారు. దీంతో పందులు, కుక్కలు ఆ చెత్తను చెల్లా చెదురు చేయడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారి దుర్గంధం వెదజల్లుతుందని జిల్లా కేంద్రం వైపు వెళ్లే ప్రయాణికులు, వివిధ వాహనదారులు, స్థానిక ప్రజలు వాపోతున్నారు. అసలే సీజనల్ వ్యాధుల కాలంలో చెత్తాచెదారం నుంచి వచ్చే దుర్గంధం వల్ల రోగాల బారినపడే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా మున్సిపల్ శాఖ అధికారులు వెంటనే స్పందించి పట్టణ కేంద్రంలో డంపింగ్ యార్డ్ ను ఏర్పాటు చేసి ప్రజల నుంచి సేకరించిన చెత్తా చెదారాన్ని డంపింగ్ యార్డ్ కు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానిక ప్రజలు కోరుతున్నారు..



# ఘనంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి 18వ వార్షికోత్సవం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో స్థానిక లూయిీ బ్రెయిలీ కాలనీలో వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్ పీఎస్) జిల్లా అధ్యక్షుడు చలగోల వెంకన్న గౌడ్ అధ్యక్షతన వికలాంగుల ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్పీ జాతీయ నాయకులు, మహబూబాబాద్ జిల్లా ఇంచార్జి గుగ్గిళ్ల పీరయ్య మాదిగ హాజరై మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆత్మ బంధువు, సామాజిక ఉద్యమాల రథసారథి, మహా జననేత మంద కృష్ణమాదిగ ఆగస్టు 28న దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా వికలాంగుల ఆత్మ గౌరవ ఉద్యమ పతాక జెండాను 36 డిమాండ్ల సాధన కోసం ఏర్పాటు చేశారని తెలిపారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉద్యమ జెండా17 సంవత్సరాలు పూర్తి చేసుకుని 18వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా యావత్ వికలాంగుల సమాజానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎండీ రజియా, వీహెచ్ పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి వినోద్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవి మాదిగ, వీహెచ్‌పీ జిల్లా నాయకులు జేరిపోతుల నారాయణ, కందాల ఉపేందర్, మాలోత్ చంద్రశేఖర్, చెవుల వెంకన్న, జల్లి కోటయ్య, భూక్య సరోజా, మునిగ కల్పన, బానోత్ సరోజ, ఎమ్మెల్సీ మహిళా, జిల్లా సీనియర్ నాయకురాలు రామరాజు పద్మ, భూక్యా కైక, బానోతు లక్ష్మి, ఎంఎస్పీ మహిళా జిల్లా అధికార ప్రతినిధి బోడ సుమిత్ర, జిల్లా ఉపాధ్యక్షురాలు గుండెల సరిత, గుంటుక రేణుక, కోళ్ల చంద్రకళ, ఎంఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తపెట్ల సౌమ్య, జ్యోతి, నీల, లూయిీ బ్రెయిలీ, వికలాంగుల కాలనీ వాసులు పాల్గొన్నారు

# నిర్మించుకున్న ప్రతి గృహానికి ఇంటి నంబర్లు ఇవ్వాలి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్న ప్రతి ఇంటికి వెంటనే ఇంటి నంబరు ఇవ్వాలని, పట్టణంలోని వార్డులలో విధి దీపాలు వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ఇల్లు నిర్మించుకున్న ప్రతి ఇంటికి ఇంటి నెంబర్ వేయాలని, వీధి దీపాలు పెట్టాలని మున్సిపల్ ఆఫీస్ ముందు సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు రావుల రాజు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ రవీందర్ కు అందజేశారు. దీనికి ముఖ్య అతిథులుగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు అల్లి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పట్టణం, పెద్ద పట్టణం, జిల్లా హెడ్ క్వార్టర్, పార్లమెంట్ నియోజకవర్గం రోజు రోజుకు పెరుగుతున్న పట్టణం, జిల్లాలో ఉన్న మండలాల ప్రజలు చిన్న చిన్న ఇళ్ల స్థలాలు కొనుక్కొని ఇల్లు కట్టుకొని నివసిస్తున్నారు. 2014లో ఇంటి నెంబర్లు ఇచ్చారని, ఇచ్చి పది సంవత్సరాలైనా ఇప్పటివరకు ఇంటి నంబర్లు వేయలేదని విమర్శించారు. ఇంటి నెంబర్లు లేకపోవడంతో పిల్లల చదువులకు కుల ధృవీకరణ పత్రం, ఆదాయం ఇతర సర్టిఫికెట్లు అధికారులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా కరెంటు మీటర్లు ఇంటి నెంబర్ లింకు పెట్టి కరెంటు మీటరు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. మహబూబాబాద్ పట్టణంలో వీధిలైట్లు లేక చీకటి మయంగా తయారైందని విమర్శించారు. పట్టణంలో సెంటర్ లైటింగ్, అవుట్ కట్స్ కాలనీలలో వీధిలైట్లు లేక పట్టణ సెంటర్ కు కూలి పని కోసం వచ్చి పోయే మహిళలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఇంటి నంబర్లు, వీధి దీపాల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చీపిరి యాకయ్య, కుమ్మరి కుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్, బానోతు వెంకన్న, మచ్చ వెంకన్న, కోటి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 'బీసీ మేలుకో-నీ రాజ్యం ఏలుకో'

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధనకై బీసీ మేలుకో నీరాజ్యం ఏలుకో నినాదంతో చైతన్యంతో సంఘటితమై పోరాడాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. బుధవారం బాలసముద్రంలోని కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యకర్తల సమావేశానికి బత్తిని సదానందం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ తరతరాలుగా అణిచివేయబడిన బీసీలు అన్నిరంగాల్లో తీవ్రంగా అన్యాయానికి గురైనారన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, చట్ట సభలలో రిజర్వేషన్ కల్పించాలని, మహిళా రిజర్వేషన్లలో బీసీ సబ్ కోటాప్రకటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు పరిచేందుకు యుద్ధ ప్రాతిపదికన కులగణన జరిపి కులాల జనాభా తేల్చాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదిగే వరకు అలుపెరుగని పోరాటాలకు బీసీలు సిద్ధం కావాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి బీసీ ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, బీసీ నాయకులు ఆదరి శ్రీనివాస్, తోట భిక్షపతి ప్రసంగించారు. నవంబర్ లో జిల్లా మహాసభ నిర్వహణకు ఏర్పడిన తాత్కాలిక కమిటీకి అధ్యక్షుడిగా బత్తిని అనిల్, ఉపాధ్యక్షులుగా బొంతు మల్లన్న, వల్లపు వెంకన్న, బత్తిని సదానందం, ఈగ లావణ్య, సహాయ కార్యదర్శులుగా రామ్ గోపాల్ చారి, ఎస్ రవి, వీరబోయిన తిరుపతి, అనుకారి అశోక్ ఎన్నికయ్యారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. నడికూడ మండలంలోని రాయపర్తి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు కట్కూరి దేవేందర్ రెడ్డి, పర్లం మల్లారెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన దేవా రైతు సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవ కేంద్రం ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందిస్తూ రైతుల నమ్మకాన్ని పెంచేలా నిర్వాహకులు వ్యాపారం కొనసాగించాలని సూచించారు. రైతు సేవ కేంద్రాలతో రైతులకు మేలు జరగాలని కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా రైతులకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. రైతులు నియంత్రిత పంటల సాగు విధానాన్ని అవలంబించి డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

## మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ అన్నారు. బుధవారం గవర్నమెంట్ హాస్పిటల్ ను తనిఖీ చేశారు. ప్రస్తుత సీజనల్ వ్యాధుల పట్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా రోజుకు ఎన్ని కేసులు నమోదు అవుతున్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా వార్డుల్లో తిరుగుతూ రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం విష జ్వరాలతో పాటు డెంగీ వ్యాధికి సంబంధించిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వైరల్ ఫీవర్ ను డెంగీగా భావించి ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డెంగీ వ్యాధిని ఎన్ఎస్ఓ పరీక్ష ద్వారా మాత్రమే నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అదే చెబుతుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో జనరల్ మందులతో పాటు 24 గంటలు డాక్టర్స్ అందుబాటులో ఉంటారని తెలిపారు. పట్టణ ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అనంతరం ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిసి తొర్రూరుకు సంబంధించిన డంపింగ్ యార్డ్ కు పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్, హెల్త్ అసిస్టెంట్ రాజు, శానిటరీ ఇన్ స్పెక్టర్ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలో క్రీస్తు శే బానోత్ సమ్మయ్య కూతురు ప్రవంతి హాస్పటల్ ను బుధవారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజలతో మర్యాదగా నడుచుకుంటే సగం రోగం తక్కువవుతుందని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోని సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సమస్యలపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జి శ్రవణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని, అడ్మిషన్ ఫీజు పేరుతో విచ్చలవిడిగా విద్యార్థుల నుంచి ఫీజులు దండుకుంటున్నారని, అదేవిధంగా డిగ్రీ పూర్తయిన విద్యార్థుల నుంచి ఫీజు రియింబర్స్ మెంట్ వసూలు చేస్తూ విద్యార్థులకు ఇబ్బందులను గురిచేస్తుందని, పై చదువులకు వెళ్లాలంటే డిగ్రీ పూర్తైన అవసరం సర్టిఫికెట్స్ ఎంతో అవసరమని, కానీ కళాశాల యాజమాన్యం ఇవ్వకపోవడం వల్ల ఎంతో మంది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. కళాశాల భవనం కూడా శిథిలావస్థలో ఉందన్నారు. అదేవిధంగా వెంటనే అధిక ఫీజులు నియంత్రించకుంటే పెద్ద ఎత్తున నిరసనకు దిగుతామని హెచ్చరించారు.

# అందని ద్రాక్షగా మారిన ఇంటర్మీడియట్ మధ్యాహ్న భోజన పథకం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఖాళీ ప్లేట్లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం వెంటనే అమలు చేయాలన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్కాలర్ షిప్ ను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సాయి, తేజ, మహేష్, తరుణ్, వినయ్, అజయ్ వర్మ, విష్ణు తేజ విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ హనుమకొండ, వరంగల్ జిల్లాల పర్యటన సందర్భంగా కార్యక్రమాలకు హాజరవుటకు గాను హెలికాప్టర్ లో వచ్చిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బుధవారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల హెలిపాడ్ వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. వరంగల్ నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

# కేయూ పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీలోని హ్యూమనటిస్ బిల్డింగ్ లో బుధవారం పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. అసోసియేషన్ ప్రెసిడెంట్ గా సోల్తి కిరణ్ గౌడ్, జనరల్ సెక్రెటరీగా డాక్టర్ కె.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ సుభాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ కుమార్, ట్రెజరర్ గా డాక్టర్ కేవీఎస్ నరేందర్, అడ్వైజర్ గా డాక్టర్ ఎంకే సుమంత్, డాక్టర్ ఓ.మోహన్, కోఆర్డినేటర్ గా రాజేంద్రప్రసాద్ లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. ఈ సందర్భంగా సోల్తి కిరణ్ గౌడ్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్ టైం లెక్చరర్స్ అందరి సమస్యలు పరిష్కారయ్యే విధంగా ఫుల్ వర్క్ లో ఉన్న ప్రతి పార్ట్ టైం అధ్యాపకులకు ఎస్ ఎఫ్ సీ రెగ్యులర్ అని తేడా లేకుండా కన్వర్షన్ కోసం యూనివర్సిటీ ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దల ప్రజా ప్రతినిధుల సహాయ సహకారంతో మన సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

# రేపు డయల్ యువర్ డీఎం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బుధవారం హనుమకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ డిపో పరిధిలోని జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలా వరంగల్, హనుమకొండ హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, హనుమకొండ, కాజీపేట మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు డిపో అభివృద్ధికి, వారి సౌకర్యవంతమైన ప్రయాణం కోసం తమ సూచనలను, సలహాలను అందించాలని కోరారు. ఇందు కోసం గురువారం ఉదయం11-12గంటల వరకు 9959226049కు ఫోన్ చేయాలని డీఎం తెలిపారు.

# ఎలక్ట్రిక్ వెహికిల్స్ షోరూమ్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలో ఎలక్ట్రిక్ వెహికిల్స్ షోరూమ్ ను బుధవారం స్థానిక శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాల నుంచి పల్లెల వరకు పెట్రోల్, డీజిల్ వెహికల్స్ ను తలదన్నే రీతిలో అన్ని సౌకర్యాలతో ఎలక్ట్రికల్ వెహికల్స్ ముందుకు దూసుకుపోతున్నాయని అన్నారు. అందులో భాగంగానే తొర్రూరు పట్టణ కేంద్రంలోని వరంగల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన (ఏడీఎంఎస్) ఎలక్ట్రికల్ వెహికిల్స్ షోరూమ్ ను ప్రారంభించడం జరిగిందని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనాయకులు, యూత్ నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బియ్యం అందజేత




**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల వక్కల సంతోష్ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మల్లారెడ్డిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ యుగంధర్ యాదవ్ బుధవారం వారి కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం అందజేసి, ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో కేతాపాక రత్నాకర్, కేతాపాక తిరుపతి, పంజాల రాకేష్, బోళ్ల నవీన్, కందాల సాయినాథ్, జూపాక కుమారస్వామి, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**వరంగల్ వాయిస్, కాటారం:** ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కాటారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, అటవీ, ఐటీఐ, టిజిఐఐసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాటారం డివిజన్ లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు భూమి అవసరం ఉందని, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కాటారం లో ఐటీఐ, టీజీఐఐసీ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించామని, పనులు ఎందుకు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి లభించడమే కష్టమైన నేపథ్యంలో ఎన్నో ప్రయాసలకు లోనై భూమి కేటాయించామని తక్షణమే పనులు చేపట్టాలని ఆదేశించారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభం కాకపోతే నివేదికలు అందచేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయం కోసం కాటారం లో గల యూత్ ట్రైనింగ్ సెంటర్ ను పరిశీలించారు. కొత్తపల్లి లో ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియ ను పరిశీలించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను, ట్రైబల్ బాలికల రెసిడెన్సిషియల్ పాఠశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, గారెపల్లి లో బాలాజీ ప్రైవేట్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కాటారం మండలం, కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరావు, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ఆర్డీఓ మంగిలాల్, తహసీల్దార్ నాగరాజు, ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతి, టీజీఐఐసీ డీఈ స్మరత్ చంద్ర, కస్తూర్బా గాంధీ గురుకులం ప్రత్యేక అధికారిని చల్ల సునీత, డాక్టర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ఆసియా అథ్లెటిక్స్‌లో దీప్తికి బంగారు పతకం

## అభినందించిన ముత్తినేని వీరయ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆసియా అథ్లెటిక్స్ లో బంగారు పతకం సాధించి 2024 పారిస్ లో జరుగు పారా ఒలంపిక్స్ లో 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొనడానికి వెళుతున్న తెలంగాణ ముద్దు బిడ్డ జీవాంజి దీప్తికి తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్, తెలంగాణ పారా స్పోర్ట్స్ గౌరవాధ్యక్షుడు ముత్తినేని వీరయ్య శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్ లోని వికలాంగుల సంక్షేమ కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ నుంచి ప్రారంభమై నేడు ఒలింపిక్ క్రీడల్లో పతకం సాధించడానికి వెళ్లడం పట్ల మాకు, మా అసోసియేషన్ కు, మా సమస్త పారా క్రీడాకారులకు, వికలాంగుల జాతికి చాలా గర్వంగా ఉందన్నారు. జీవన్ జీ దీప్తి ఆత్మవిశ్వాసంగా ముందుకు వెళ్లాలని, పట్టుదలతో పరుగు పందెంలో పాల్గొని బంగారు పతకాన్ని సాధించి తన ప్రతిష్ఠతో పాటు దేశ గౌరవాన్ని, రాష్ట్ర గౌరవాన్ని పెంచేలా కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని, దీనిలో భాగంగా పారా క్రీడలకు కూడా హర్యానా ప్రభుత్వంలో ప్రోత్సాహం మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో కూడా పారా క్రీడాకారులకు అందేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనా రెడ్డి సహకారంతో అన్నీ సదుపాయాలు కల్పించి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సింగారపు బాబు, గౌరవ సలహాదారు సంజీవయ్య, జనరల్ సెక్రటరీ గాడిపల్లి ప్రశాంత్, టెక్నికల్ కమిటీ మెంబర్ నరేష్ యాదవ్, ట్రెజరరీ నూక రాజు, సైదులు, శ్రీనివాస్ రెడ్డీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకీకృత పెన్షన్ విధానం మరో మోసమే..



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఉద్యోగ ఉపాధ్యాయులను మరోసారి మోసం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పన్నాగం పన్నిందని సీపీఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్(యూపీఎస్) పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్ విధానం ఇందులో భాగమేనని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మురళీ కృష్ణ, జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ వివేక్ అన్నారు. డోర్నకల్ మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ముల్కలపల్లి, కన్నెగుండ్ల, చిల్కొడు,పెరుమాండ్ల సంకీస, మైనార్టీ, కస్తూర్బా, మోడల్ స్కూల్ లో టీచర్లతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు 50శాతం పెన్షన్ గ్యారంటీ చేస్తున్నట్లు, సర్వీసులో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 60 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ చందాతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించక పోవటం హేమమైన చర్య అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మాజీ మండల మహిళ అధ్యక్షురాలు కలపాల అనిత, పీఆర్టీయూ సభ్యత్వానికి రాజీనామా చేసి యూటీఎఫ్ సభ్యత తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి బండి నర్సింహా రావు, టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్, సీనియర్ నాయకులు తుమ్మ వెంకటప్పయ్య, సోమనబోయిన శ్రీనివాస్, శంకర్, సాహెబ్ అలీ, బుచ్చయ్య, అమీన్, రాములు, లక్ష్మి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పీస్ కమిటీ సమన్వయ సమావేశం




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామ పెద్దలు, మత పెద్దలు, నాయకులతో బుధవారం తొర్రూరు డీఎస్పీ సురేష్ పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ప్రజాక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాబోయే గణేష్ ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ పండగల దృశ్య మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాలమేరకు తొర్రూరు సర్కిల్ లోని తొర్రూరు, దంతాలపల్లి, నెల్లికుదుర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామ పెద్దలు, మతపెద్దలు, నాయకులతో తొర్రూరు డీఎస్పీ సురేష్ శాంతి సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తొర్రూరు డీఎస్పీ సురేష్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలకు, మిలాద్-ఉన్-నబీ పండుగలకు సంబంధించి పలు సూచనలు చేశారు. రాబోయే అన్ని పండుగలు ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వదంతులు నమ్మవద్దని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని, తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు సీఐ జగదీష్, తొర్రూరు ఎస్ఐ-1 ఉపేందర్, ఎస్ఐ-2 రాంజీ నాయక్, నెల్లికుదురు ఎస్ఐ రమేష్ బాబు, దంతాలపల్లి ఎస్ఐ రాజు, నర్సింహుల పేట ఎస్ఐ సురేష్, మతపెద్దలు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

## జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గణేష్ నవరాత్రులను దృష్టిలో పెట్టుకుని మహబూబాబాద్ జిల్లా పరిధిలో గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించేందుకుగాను మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ తరపున గణేష్ నవరాత్రి మండపాల నిర్వహకులకు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ బుధవారం ఒక ప్రకటన ద్వారా పలు సూచనలు చేశారు. గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తప్పని తీసుకోవాల్సి ఉంటుందని, ఇందు కోసం ముందుగా నిర్వాహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్ https://policeportal.tspolice.gov.in ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్ లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారని తెలిపారు. గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తీసుకోవాలన్నారు. గణేష్ మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలని, షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించాలని, గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలని, వృద్ధులు, చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్దకాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలని, మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డీజేను ఏర్పాటు చేయరాదన్నారు. గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో షెడ్ నిర్మాణంలో మంచి నాణ్యత గల షెడ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. గణేష్ మండపంలో 24 గంటలు ఒక వలంటీర్ ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలని, గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శను దృష్టిలో వుంచుకోని మండపాలలో భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వలంటీర్లను నియమించాలన్నారు. గణేష్ మండపాల వద్ద ఎప్పుడైన అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్తలో భాగంగా దగ్గరలో రెండు బకెట్ల నీళ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట అడటం, లక్కీ డ్రాలు నిర్వహించడం, అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు, అన్య మతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటంపై పూర్తిగా నిషేధమని తెలిపారు. విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి, పోలీసు అధికారులతనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారని చెప్పారు. మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లుయితే తక్షణమే డయల్ 100గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

## వికసిత్ భారత్ @ 2047



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వికసిత్ భారత్ @ 2047' లక్ష్యానికి అనుగుణంగా, జాతీయ స్థాయి నుంచి ప్రతి రాష్ట్రం, నగరం, గ్రామం, బూత్ స్థాయి వరకు పార్టీని మరింత విస్తరించేలా, తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మాజీ శాసన సభ్యుడు, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సూచన మేరకు బుధవారం 33 వ డివిజన్ లో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులుడు పోలేపాక మార్టిన్ లూథర్, ప్రధాన కార్యదర్శి మాదాసు రాజు ఆధ్వర్యంలో (చాయ్ పే చర్చ ) సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పోలేపాక మార్టిన్ లూథర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మండల, డివిజన్, బూత్ స్థాయి నుంచి కన్వీనర్ల, కో-కన్వీనర్ల నియామకం చేపడుతున్నామని, జిల్లా మండల, గ్రామ, బూత్ స్థాయి వరకు కార్య శాలలు ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నామని 30 న రాష్ట్ర పార్టీ ఆఫీసులో అవగాహన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శులు మాదాసు రాజు, ఉసిల్ల దయాకర్, నమీండ్ల కన్నయ్య, ఉపాధ్యక్షులు నలిగంటి నర్సింగ్గం, మైదం వీరస్వామి, మారుమూల ప్రవీణ్, అధికార ప్రతినిధి గొర్రె కోటి, మేకల రాజు, కంజర్ల విజయ్, వర్కోటి రాకేష్, కంజర్ల వాసు, పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మల్లం వెంకటేశం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, జాతీయ ఉపాధ్యక్షుడు ఏటి ఆంజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకటేష్ ఆదేశాల మేరకు బుధవారం జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురా స్రవంతి, మల్లం వెంకటేశం కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లం వెంకటేశం మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, జాతీయ ఉపాధ్యక్షుడు ఏటి ఆంజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకటేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ కు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురా స్రవంతిలకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కల్పించడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. పందుల రాజు గౌడ్, బత్తుల మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

# విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

## సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. బుధవారం ఆగస్టు 28న విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హనుమకొండ బాల సముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల చిత్ర పటానికి సీపీఐ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ హైదరాబాద్ బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమంలో జరిగిన కాల్పులలో నలుగురు అమరులయ్యారని, ఫలితంగా నాటి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతకు దిగి పోయిందన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు చేసే ఏ ప్రభుత్వం అయినా తలవంచక తప్పదని విద్యుత్ ఉద్యమం రుజువు చేసిందన్నారు. నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కూడా దేశంలో నియంతృత్వ విధానాలతో పాలన సాగిస్తూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నదని మండిపడ్డారు. పెట్టుబడి దారులకు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముగాస్తూ, వారికి లక్షల కోట్ల రూపాయల రాయితీలు కల్పిస్తూ, పేదల, మధ్య తరగతి వర్గాల సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, నేదునూరి రాజమౌళి, బత్తిని సదానందం, కొట్టె వెంకటేష్, అనుకారి అశోక్, బత్తిని అనిల్, ఎర్ర కుమార స్వామి, లావణ్య, పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన పత్తిపాక విద్యార్థులు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** హైదరాబాద్ సరూర్ నగర్లో ఆగష్టు 31, సెప్టెంబర్ 1వ తేదీలలో జరుగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు శాయంపేట మండలం పత్తిపాక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బి.మాధవి, ఉపాధ్యాయులు బొలిశెట్టి కమలాకర్ తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లా స్థాయిల విద్యార్థుల ఎంపిక పోటీలు ఈ నెల 25, 26 తేదీలలో రంగశాయిపేట బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, పత్తిపాక ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-18 విభాగంలో గాదె సాయి ప్రణయ్ (బంగారు పతకం), గడ్డి నవదీప్ (కాంస్యం), అండర్-16 విభాగంలో గజ్జి వరుణ్ (బంగారు పతకం), గజ్జి రాజేష్, సాల్మాన్ (రజతం), అండర్-10 విభాగంలో ప్రాథమిక పాఠశాలకు చెందిన దైనంపల్ల మనోజ్ కుమార్ (బంగారు పతకం), గజ్జి విజ్ఞాన్ (రజతం) లు సాధించారని, తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వారు వివరించారు. విద్యార్థులకు యోగాలో శిక్షణనిచ్చిన కోచ్ వ్యాయామ ఉపాధ్యాయులు కమలాకర్ ను విద్యార్థులను ప్రాథమిక పాఠశాల పుధానోపాధ్యాయుడు టి.శ్రీనివాస్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రఘు, సోంబాబు శర్మ-అనిత, విజయ, కిరణ్మయి, విజయ్ కుమార్, వసంతలను అభినందించారు.

## వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** శ్రావణమాసంలో జరిగే గ్రామ దేవత పోచమ్మ తల్లి బోనాలు బుధవారం మండలంలోని పలు గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. రాయపర్తి గ్రామంలో జరిగిన బోనాల కార్యక్రమంలో మహిళలు ఉదయం 10 గంటల నుంచి బోనాలు ఎత్తుకొని పిల్లాపాపలతో డప్పు చప్పుడు, మంగళ వాయిద్యాలు మధ్య పోచమ్మ తల్లికి నూతన వస్త్రాలు ,కొబ్బరికాయలు కొట్టి బోనాలు సమర్పించారు. బుధవారం గ్రామం నలుమూలల నుంచి భక్తులు పోచమ్మ దేవాలయానికి కోళ్లు, మేకలతో పోచమ్మ తల్లి దేవాలయానికి చేరుకొని మొక్కలు చెల్లించారు. పిల్ల పాపలు ఆయురారోగ్యాలతో ఉండాలని దేవతను వేడుకున్నారు.

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



**వరంగల్ వాయిస్, కన్నాయిగూడెం :** ఈనెల 30న ములుగు జిల్లాలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ఇంటెక్ వెల్ పంప్ హౌస్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నీటిపారుదల శాఖ మంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్, రహదారి, రివ్యూ సమావేశ ఏర్పాట్లను పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం తుపాకులగూడెం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను, అంగన్వాడీ కేంద్రం-1 తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. అంగన్వాడీ చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ విజయభాస్కర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జగదీష్, డీఈ ప్రవీణ్, శరత్, తహసీల్దార్ సలీం, ఎంపీఓ, తదితరులు పాల్గొన్నారు.



## స్పెషల్ సాంగ్‌లో శ్రియా శరణ్



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ స్టార్ కాంపౌండ్ నుంచి ఇప్పటికే కంగువ విడుదలకు ముస్తాబుతోంది. ఈ సినిమా విడుదల కాకముందే సూర్య 44 కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు సూర్య. స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. తొలి షెడ్యూల్‌లో భాగంగా అండమాన్ లోని పోర్ట్ ÷-లబెయిర్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తోపాటు సూర్య, పూజాహెగ్డేపై వచ్చే సాంగ్స్‌ను చిత్రీకరించి నట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. తాజాగా మరో ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీలో సీనియర్ హీరోయిన్ శ్రియా శరణ్ స్పెషల్ సాంగ్‌లో మెరువనుంది. ఊటీ షెడ్యూల్‌లో ఈ పాటను చిత్రీకరించనున్నారట మేకర్స్. ప్రస్తుతం సినిమా షూటింగ్ ఇడుక్కి పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్నట్టు సమాచారం. ఈ చిత్రంలో పాపులర్ మలయాళ నటుడు జోజు జార్జ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీకి సంతోష్ నారాయణన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పీరియాడిక్ వార్ అండ్ లవ్ నేపథ్యంలో వస్తోన్న సూర్య 44కు తిరు, 24, పేటా ఫేం సినిమాటోగ్రఫర్ డీవోపీగా పనిచేస్తున్నాడు. సూర్య హోంబ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పై తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని మేకర్స్ 2025 పొంగల్ కానుకగా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.




## టాలెంట్‌కు స్థానం లేదు

హిందీ చిత్ర పరిశ్రమలో టాలెంట్‌ను ఎంకరేజ్ చేయరని అంటూ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. టాలెంట్ ఉన్నవారికి ఇక్కడ ఎలాంటి గుర్తింపు లభించదని ఆరోపించారు. ప్రోత్సహించే వారు కూడా ఉండరన్నారు. నా దృష్టిలో బాలీవుడ్ ఒక నిస్సహాయ ప్రదేశం. ఈ పరిశ్రమకు చెందిన కొంతమంది ప్రముఖ వ్యక్తులు మనకు ఎలాంటి సాయం చేయరు. టాలెంట్‌ని చూసి వారు అసూయ పడతారు. ఎవరైనా టాలెంట్ ఉన్న వ్యక్తులు తమ దృష్టిలో పడితే తప్పకుండా వారి కెరీర్ నాశనం చేయడానికి చూస్తారు. పీఆర్‌లను నియమించి వారిపై దారుణంగా అవాస్తవాలు ప్రచారం చేయిస్తారు. ఇండస్ట్రీ వారిని బహిష్కరించేలా పరిస్థితులు సృష్టిస్తారు' అని కంగనా రనౌత్ ఆరోపించారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. తాను అదే విధమైన పరిస్థితులు ఎదుర్కొన్నానని చెప్పారు. తనను బహిష్కరించారని పేర్కొన్నారు. 'నా వరకూ నేను మంచి వ్యక్తిని. నా చుట్టూ ఉన్న వారితో మర్యాద పూర్వకంగా నడుచుకుంటా. ఎన్నికల్లోనూ విజయం సాధించా. ఇండస్ట్రీ నుంచి ఎంతో ప్రేమాభిమానం పొందా. దీనిని బట్టి చూస్తే నాతో కొంతమందికి మాత్రమే సమస్య ఉంది. ఆ సమస్య నాలో ఉందా? లేదా వారిలో ఉందా? అనేది వారు కూడా ఒక్కసారి ఆలోచిస్తే మంచిది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రాజకీయ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎమర్జెన్సీ' ఆమె స్వీయ దర్శకత్వంలో తెరకెక్కింది. సెప్టెంబర్ 6న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నారు. తన కెరీర్, బాలీవుడ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో తనపై కుట్ర జరిగిందని చెప్పారు. తన సినిమాల్లో యాక్ట్ చేయొద్దని చాలా మందికి చెప్పారని ఆరోపించారు.

## నిజాలు బయటపెట్టినందుకు వేధింపులు





మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళల స్థితిగతులపై జస్టిస్ హేమ కమిటీ సమర్పించిన నివేదికలో పలు దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూశాయి. ఇప్పటి వరకు లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి 17 కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా.. గతంలో ఎదురైన చేదు అనుభవాన్ని బయటపెట్టినందుకు తనకు సోషల్ మీడియా వేదికగా బెదిరింపు సందేశాలు వస్తున్నాయని ఓ నటి తెలిపారు. ప్రముఖ నటుడు జయసూర్యతోపాటు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు వల్ల తాను ఇబ్బందులు ఎదుర్కొన్నా నంటూ నటి మిను మునీర్ ఇటీవల ఆరోపించిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయం బయపెట్టిన దగ్గరి నుంచి తనకు బెదిరింపు సందేశాలు వస్తున్నాయని ఆమె తెలిపారు. దానికి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ విషయం మరో చర్చనీయాంశంగా మారింది.

### ముందుకు వచ్చిన మహిళలకు అండగా నిలవండి

హేమ కమిటీ రిపోర్ట్ ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ. ప్రతి పరిశ్రమలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయంటూ తాజాగా ఆమె ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. కెరీర్‌లో రాణించాలనుకుంటే వేధింపులు లేదా కమిట్‌మెంట్ ఇవ్వాలని కోరడం లాంటి పరిస్థితులు మహిళలకు అన్ని రంగాల్లోనూ ఎదురవుతున్నాయి. సమస్య ఎదురైనప్పుడే వారెందుకు మాట్లాడలేదని చాలామంది ప్రశ్నిస్తున్నారు. బయటకు వచ్చి చెప్పే ధైర్యం అందరికీ ఉండదు కదా. తండ్రి వేధింపుల గురించి బయటకు వచ్చి మాట్లాడటానికి ఎందుకు అంత సమయం తీసుకున్నావు? అని చాలామంది గతంలో నన్ను అడిగారు. నిజమే.. నేను ముందే మాట్లాడాల్సింది. ఆ ఘటన కెరీర్ విషయంలో జరిగింది కాదు. నన్ను రక్షించాల్సిన వ్యక్తి నుంచే నేను వేధింపులు ఎదుర్కొన్నా. చాలామంది మహిళలకు కుటుంబం నుంచి సరైన మద్దతు లేదనే విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలి. చిన్న గ్రామాలకు చెందిన ఎంతోమంది అమ్మాయిలు ఎన్నో ఆశలతో ఇక్కడికి వస్తారు. వారి ఆశలను ఆదిలోనే తుంచేస్తున్నారు. పురుషులందరికీ నేను చెప్పేది ఒక్కటే.. బాధిత మహిళలకు అండగా నిలవండి.



## ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్

### ప్రభాస్‌పై విక్రమ్ ప్రశంసల వర్షం



ప్రపంచస్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్న స్టార్ హీరో ప్రభాస్ ప్రస్తుతం వరుస విజయాలను అందుకుంటూ రికార్డులు సొంతం చేసుకుంటున్నారు. తాజాగా ప్రభాస్ గురించి కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.'ప్రభాస్ ఇప్పుడు ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్. అతడిని తెలుగు హీరో అనడం సరికాదు' అని విక్రమ్ అన్నారు. మాళవిక మాట్లాడుతూ.. ప్రభాస్‌తో కలిసి నటించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. భాషపరంగా సినిమా సరిహద్దులను తొలగించారని ప్రశంసించారు. ఆయన నటించిన సినిమాలపై ప్రేక్షకులు చూపే అభిమానం చూస్తే ఆశ్చర్యమేస్తుందని చెప్పారు. ఈ ఏడాది 'కల్కి 2898 ఏడీ'తో భారీ విజయాన్ని అందుకున్న ప్రభాస్.. ప్రస్తుతం వరుస పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'రాజాసాబ్'. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీని షూటింగ్ అప్‌డేట్‌పై నిర్మాత క్లారిటీ ఇచ్చారు. 'ప్రభాస్ పాత్ర చిత్రీకరణ పూర్తయింది. సినిమా షూటింగ్ కూడా కంప్లీటైంది' అని ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు నిర్మాత శ్రీనివాస కుమార్ (ఎస్‌కెఎన్) రిప్లై ఇచ్చారు. 'ప్రభాస్ పాత్ర పూర్తయితే సినిమా షూటింగ్ అంతా కంప్లీట్ అయినట్లు కాదు కదా!' అని పేర్కొన్నారు. ప్రస్తుతం దీని చిత్రీకరణ శరవేగంగా జరుగుతోందన్నారు. రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో సిద్ధమవుతోన్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవిక మోహనన్‌తో పాటు నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా కనిపించనున్నారు.



# రుద్రేశ్వర స్వామి, భద్రకాళిని దర్శించుకున్న గవర్నర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రముఖ దేవాలయాలైన హనుమకొండలోని వేయి స్తంభాల గుడి, వరంగల్ లోని భద్రకాళి దేవాలయాలను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పూజారులు గవర్నర్ కు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రకాళి అమ్మవారికి పుష్పాభిషేకం చేశారు. అనంతరం మహదాశీర్వచనం నిర్వహించి ప్రత్యేక వస్త్రాలతో సత్కరించారు. అనంతరం ఖిలా వరంగల్ చేరుకొని చమన్ లో ఏర్పాటు చేసిన పెరిణి శివతాండవం, శివ లాస్యం, రాణి రుద్రమ, చిందు యక్షగానం తదితర నృత్యలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతోపాటు మంత్రులు దనసరి అనసూయ, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య



శారదా, సీపీ అంబర్ కిషోర్ ఝా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే, కార్పొరేటర్లు భోగి సువర్ణ సురేష్, ఉమా దామోదర్ యాదవ్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.







# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

## పొంగులేటికి పాత్రికేయుల వినతి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ నగరంలోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయమై బుధవారం కాకతీయ జర్నలిస్టు సొసైటీ బాధ్యులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసారు. రెండు సొసైటీలతో పాటు సొసైటీల్లో లేని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు త్వరగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ పూర్తి చేశామని, త్వరలోనే వరంగల్ జర్నలిస్టుల సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన వారిలో కాకతీయ జర్నలిస్టు సొసైటీ అధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్, కార్యదర్శి సీహెచ్.సోమనర్సయ్య, డైరెక్టర్ వేణుమాధవ్ తదితరులున్నారు.



# జీఓ 46 బాధితులకు లభించని ఊరట

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జీఓ 46 బాధితులకు ఊరట లభించలేదు. వారిపై ప్రభుత్వం పెట్టిన కేసును బుధవారం హైకోర్టు కొట్టివేసింది. దీంతో అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగులు రాకేష్ రెడ్డి బాధితులను పరామర్శించారు. భావోద్వేగానికి గురైన కంట తడి పెట్టారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్దామంటూ ధీమా ఇచ్చారు. ప్రభుత్వం తన పంతాన్ని అభాగ్యులు, బలహీనులైనా జీవో 46 బాధితులపైన చూపించడం సిగ్గుచేటన్నారు. బాధితులు ప్రైవేటుగా లాయర్లను సమకూర్చుకొని న్యాయపరంగా పోరాటం చేసినప్పటికీ ప్రభుత్వం పంతం ముందు ఓడిపోవలసి వచ్చింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్టుగా అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి సైతం ప్రైవేట్ కేసు వేయగా బుధవారం జీవో 46 బాధితులతో కలిసి అదే కేసులో హైకోర్టుకు హాజరయ్యారు. హైకోర్టు జీవో 46 బాధితులను నిరాశపరచడంతో కన్నీటి పర్యంతమైన యువకులను రాకేష్ రెడ్డి ఓదార్చడం అందరినీ కదిలించింది. కాంగ్రెస్ ప్రభుత్వం తమను రాజకీయాల కోసం వాడుకొని అధికారంలోకి వచ్చాక ఆగం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాట ఇచ్చినట్టుగా జియో 46 విషయంలో బాధితులకు న్యాయం జరిగే వరకు అన్ని రకాలుగా పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటానని రాకేష్ రెడ్డి హామీ ఇచ్చారు.

# పీడీఎస్ యూ విద్యార్థుల ర్యాలీ

## అదనపు కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతి

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న రూ.8 వేల కోట్ల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పీడీఎస్ యూ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సర్వే పల్లి రాధాకృష్ణన్ విగ్రహం నుంచి ప్రభుత్వ జనరల్ హాస్పటల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లెనిన్ వాత్సవ్ టొప్పోకి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ రాక దళిత, గిరిజన, అట్టడుగు వర్గాల విద్యార్థులు అనేక ఆర్థికపరమైన అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం పోయి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చినా విద్యార్థుల వెతలు, బాధలు మాత్రం మారటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు సైతం పెండింగ్ లో ఉన్నాయని, దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు




ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కేజీ టు పీజీ వరకు విద్యార్థులందరికీ స్త్రీ, పురుష భేదం లేకుండా ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనార్టీ గురుకులాలు, స్టూడెంట్ మేనేజ్మెంట్ (ఎస్.ఎం.ఎస్) హాస్టల్స్ కు సొంత భవనాలు నిర్మించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో, హాస్టల్స్ లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పీడీఎస్ యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బోట్ల గౌతం, పి.అభి శంకర్, ఓ.దేవేందర్, టి.మల్లికార్జున్, టి.అభిలాష్, చరన్, అఖిల్, నగేష్, ప్రశాంత్, నందు, రణధీర్, రాము, విగ్నేష్, బాబు సింగ్, సన్నీ, మౌలాలి, విష్ణు, నందు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలోని సర్జికల్, జనరల్ మెడిసిన్, వివిధ వార్డులలో చికిత్స పొందుతున్న పేషెంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న ప్రతీ పేషేంట్ వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను స్వయంగా వారిని అడిగి తెలుసుకున్నారు. పేషంట్ల కేసు షీట్ లను పరిశీలించి వారికి అందిస్తున్న వైద్యాన్ని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తమై పేషెంట్లకు ఇబ్బంది కలుగకుండా వైద్య సేవలు కల్పించాలని సూచించారు. ఆసుపత్రిలోని వార్డులలో ఉన్న మందులను పరిశీలించారు. ఆసుపత్రులలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ డయాగ్నస్టిక్ ను పరిశీలించి ప్రతిరోజు ఎన్ని టెస్టులు టీహబ్ కు వస్తున్నాయని, ఎక్కువగా ఎక్కడి నుంచి శాంపిల్స్ వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్, డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com